క్లుప్తంగా

మంత్రికి వినతి



మహబూబాబాద్: శివసత్తులకు జీవన భృతి కల్పించాలని మంత్రి సత్యవతి రాథోడ్‌కు బహుజన పూజారుల శివసత్తుల సేవా సమితి నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ, రమేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి మంత్రిని కలిసి మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో ఈనెల 7న సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో గోపి, పెరుగు కుమార్, రవి, నాగార్జున పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ జి.చంద్రమోహన్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కమిటీ బాధ్యులు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్, పదో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, జిల్లా గౌరవ యువజన అధ్యక్షుడు ధరావత్ రమేష్ నాయక్, జిల్లా యువజన అధ్యక్షుడు హథిరాం నాయక్, టౌన్ గౌరవ అధ్యక్షుడు కేలోత్ మల్సూర్ నాయక్ ఉన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



పెద్దవంగర: దాతల సాయం అభినందనీయమని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి స్రవంతి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలోని కేజీబీవీ పాఠశాలకు రామచంద్ర తండా ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు చిక్కాల సతీష్ రూ.7వేల విలువ చేసే 12కుర్చీలు అందజేశాడు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు ఐలయ్య, ఉపాధ్యాయులు గుర్రం శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కడియంను కలిసిన నాయకులు



నెహ్రూసెంటర్: ఎమ్మెల్సీ, స్టేషన్ ఘనపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని మానుకోట ఎంఆర్‌పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కోండ్ర ఎల్లయ్య హనుమకొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి బొకే అందజేశారు. శ్రీను, గుట్టయ్య, సీహెచ్ రాధా, సుధా, ఉపేందర్, బాలరాజు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గూడూరు: ప్రతీ ఒక్కరు పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాధన ర్సింహానాయక్ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, రమాదేవి, భారతి, సరోజన పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

తొర్రూరు: నకిలీ ఆడ, మగ వరి విత్తనాలు అంటగట్టి రైతులను మోసగించిన ఓ విత్తన కంపెనీ నుంచి నష్టపరిహారం దక్కింది. వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా కన్వీనర్ వింజమూరి సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో బాధిత రైతులకు కంపెనీ ప్రతినిధి బాధిత రైతులకు ఎకరాకు రూ.40వేల పరిహారం అందజేశారు. మరో కేసులో మోసగించిన ఓ చిట్‌ఫండ్ కంపెనీ నుంచి నెల్లికుదురుకు చెందిన మోహన్‌రావుకు రూ.13.50 లక్షల పరిహారం అందినట్లు సుధాకర్ తెలిపారు.

11నుంచి సమ్మెబాట

గార్ల: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం గార్ల తహసీల్దార్ కె.స్వాతిబిందుకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సరిత, పద్మ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఆత్మహత్య

గార్ల: గార్లకు చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలో వేంకటేశ్వరస్వామి దేవాలయం బజారుకు చెందిన తాళ్లపల్లి ప్రసాద్‌గౌడ్(48) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, మొదటి భార్యను 20 ఏళ్ల క్రితం వదిలేసి హైదరాబాద్ వెళ్లి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడ మరో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఒక కూతురు, ఒక కుమారుడు కాగా, రెండో భార్యకు ఇద్దరు కూతుళ్లు సంతానం. ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని మృతి చెంది ఉంటాడని మృతుడి బంధువులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గురుపూజోత్సవం

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలల్లో మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్

మహబూబాబాద్ అర్బన్: అనంతారం మోడల్ స్కూల్‌లో..



మహబూబాబాద్ రూరల్: మాధవాపురంలో..



బయ్యారం: వెంకట్రాంపురం ఉన్నత పాఠశాలలో..





కొత్తగూడలో..



మహబూబాబాద్ అర్బన్: ఈదులపూసపల్లిలో..



దోర్నకల్: సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో..



కేసముద్రం: ఇనుగుర్తి గురుకుల పాఠశాలలో..



మరిపెడ రూరల్: గాలివారిగూడెం పాఠశాలలో..



మహబూబాబాద్: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..



పెద్దవంగర: అవుతాపురంలో..



గార్ల: ఆశ్రమ పాఠశాలలో..



మరిపెడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం..



గూడూరు బాలికల హైస్కూల్‌లో..



కురవిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



గంగారంలో..



తొర్రూరులో..



కురవి: సీరోలు మండలం కాంపల్లిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం ఆవిష్కరణ..

వచ్చే ఎన్నికల్లో ఓటేసి ఆశీర్వదించాలి

● జాటోత్ హుస్సేన్ నాయక్



మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

కేసముద్రం: ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మంగళవారం మండంలోని కాట్రపల్లి, భవానిగడ్డ జీపీ, శివశంకర్ నగర్, అర్పనపల్లి, కిష్టాపురం తండాలో పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి జాటోత్ హుస్సేన్ నాయక్ ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి ఏమిలేదని విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లెల్ల తండాలో పలు పార్టీల నుంచి బీజేపీలోకి చేరిన 50మందికి పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. ముందుగా కాట్రపల్లి శివాలయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాదిల నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, మార్కెట్ మాజీ చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గాంతి వెంకటరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం

దంతాలపల్లి: యువతి, యువకులను చైతన్యవంతం చేసి యువజన ఉద్యమాన్ని తీవ్రతరం చేద్దామని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన సంఘం తొర్రూర్ డివిజన్ రెండో మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం యువత పెద్ద ఎత్తున పాల్గొని పాలకుల మెడలు వంచి తమ డిమాండ్లు సాధించుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, అనిల్, కొత్తపల్లి రవి, ముంజపల్లి వీరన్న యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ముందుకు సాగుదాం



మాట్లాడుతున్న రమేష్‌నాయక్

గూడూరు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కల్సికట్టుగా సమష్టి కృషితో ముందుకు సాగితే రాబోయే ఎన్నికల్లో మానుకోట గడ్డపై కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవచ్చని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి తరలివచ్చిన మండల, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అమలు చేస్తున్న ఏ ఒక్క పథకం రాజకీయాలకు అతీతంగా అమలు కావడంలేదని, ఒక్క బీఆర్‌ఎస్ కార్యకర్తలకే చెందుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, మండల మల్లేష్‌యాదవ్, గోపగాని యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని నిరసన



మహబూబాబాద్ రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: ధరల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని సీపీఎం మండల కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఆర్థిక అసమానతలపై సీపీఎం ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం, మల్యాల గ్రామాలలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో యాకయ్య, లింగన్న, బ్రహ్మం, కళ్యాణ్, వెంకన్న, నరసింహారావు, రాములు, మల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామ కార్యదర్శి ఉపేందర్, నాయకులు మల్లయ్య, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



దోర్నకల్: చిలుకోడు మోడల్ స్కూల్‌లో..



నర్సింహులపేట మోడల్ స్కూల్‌లో..

దోర్నకల్: మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు స్వయం పరిపాలన వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఎమ్మెల్యే వెంటే ఉంటాం..

నెల్లికుదురు: చిన్ననాగారం శ్రీకృష్ణ యాదవ సంఘం యాదవులంతా ఎమ్మెల్యే వెంటే ఉన్నామని, రెండోవిడత గొర్రెల పంపిణీ చేపట్టాలని ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్‌ను కోరారు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో మంగళవారం ఏకగ్రీవంగా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయపాల్‌రెడ్డి, నాయకులు విజయ్ యాదవ్, కరుణాకర్, సుధాకర్, ముత్తయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

మహబూబాబాద్ అర్బన్: కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మహిళ కాంట్రాక్టు ఉపాధ్యాయినీలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం కీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, వసంత, వినోద, ధనమ్మ, స్వప్న కుమారి, తబుస్సుం సుల్తాన పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సద్వినియోగం చేసుకోవాలి

కేసముద్రం: సంపూర్ణ సురక్ష కేంద్ర అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం మేనేజర్ రమేష్ అన్నారు. ఆశాడే సందర్భంగా ఇనుగుర్తి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం సంపూర్ణ సురక్ష కేంద్రం అందించే సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్, వైద్యులు, ఎఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

నర్సింహులపేట: మండలంలో పని చేసి బదిలీపై బయ్యారానికి వెళ్లిన ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డికి మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ టేకుల సుశీల, తహసీల్దార్ వివేక్, ఎస్సై సతీష్, ఎంపీఓ సోమ్‌లాల్, ఏపీఓ భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

గంగారం: మండల కేంద్రం నుంచి చింతగూడెం వైపు 108 వాహనం వెళ్తుండగా గంగారం మండలంలోని జంగాలపల్లి నుంచి నర్సంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు బావురుగొండ- గంగారం మధ్య మలుపుల వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్ నుంచి ఓ రైల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం కేసముద్రం పోలీసులు, ఆర్‌పీఎఫ్ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బస్తాల్లో రేషన్‌బియ్యాన్ని కేసముద్రం రైల్వేస్టేషన్‌కు తీసుకువచ్చి, అక్కడి నుంచి అండమాన్ ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నట్లు తెలిసింది.

పాలాభిషేకం

డోర్నకల్: వేతనాల పెంపును హర్షిస్తూ వీఏఓలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, ఎంపీ మాళోత్ కవిత చిత్రటానికి వీఏఓలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఏఓలు చంద్రకళ, వేల్పుల శ్రీనివాస్, సేవియా, సుభద్ర, శాంతమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



కురవి: మండల కేంద్రంలోని నాగార్జున విద్యాలయానికి చెందిన విద్యార్థిని తేజావత్ బానురేఖ హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు కోచ్ కర్నం సింధూవర్మ మంగళవారం తెలిపారు. అనంతరం విద్యార్థిని సన్మానించారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్

మరిపెడ/మరిపెడ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. మండలంలోని తానంచర్ల గ్రామానికి చెందిన కొమ్ము జనార్దన్, సీత వెంకన్నకు ఎస్సీ రుణాల కింద మంజూరైన రూ.3.5లక్షలు చెక్కును మంగళవారం ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, సూపరింటెంట్ శేషయనం పాల్గొన్నారు.

రెండు తలల దూడ జననం



కేసముద్రం: గేదెకు ఒకే ఈతలో రెండు దూడలు జన్మించగా, అందులో ఒక దూడ రెండు తలలతో జన్మించిన వింత ఘటన ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామ శివారు కోక్యాతండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన బానోత్ సుందర్ అనే రైతుకు చెందిన గేదె తన ఇంటి ఆవరణంలో, ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. అందులో ఒక దూడకు రెండు తలలతో జన్మించింది. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కాగా కొంత సమయంలోనే ఆ రెండు దూడలు మృతి చెందాయి. జన్యు లోపంతో ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయని పశువైద్యాధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి



గూడూరు: విద్యుదాఘాతంతో రెండు పాడి పశువులు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన బోడ యాకయ్య అనే రైతు పాడి పశువులను మేపడానికి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి తీసుకెళ్లాడు. అవి గడ్డి మేస్తు అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఫర్టిలైజర్ షాపు తనిఖీ

బయ్యారం: ఎరువులు విక్రయిస్తున్న డీలర్లు తమ వద్ద ఉన్న ఈ–పాస్ మిషన్, గ్రౌండ్ బ్యాలెన్స్ క్లియర్‌గా ఉంచుకోవాలని లేని ఎడల సంబంధిత డీలర్లపై చర్య తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాంజీ అన్నారు. బయ్యారంలోని పలు ఎరువుల షాపుల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రెండు షాపుల్లో ఓఫామ్ లేకుండా విక్రయిస్తున్న ఆర్గానిక్ పొటాష్, డీఏపీల అమ్మకాలను నిలిపివేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ నూతన సర్వీసులు ప్రారంభం

నెహ్రూసెంటర్/కేసముద్రం: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి గూడూరు–తొర్రూరుకు వయా కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు ద్వారా బస్సు సర్వీసు ప్రారంభించినట్లు డిపో మేనేజర్ జె.విజయ్ మంగళవారం తెలిపారు. కేసముద్రం నుంచి గూడూరుకు ఉదయం 10.20, 1.30, 2.25 గంటలకు, కేసముద్రం నుంచి తొర్రూరుకు ఉదయం 10.50, 11.35, సాయంత్రం 03.5 గంటలకు, గూడూరు నుంచి తొర్రూరు ఉదయం 11.00, మధ్యాహ్నం 02.30 గంటలకు, తొర్రూరు నుంచి గూడూరుకు మధ్యాహ్నం 12.15, 1.15 గంటలకు అందుబాటులో ఉన్నాయన్నారు.


కూరగాయల మార్కెట్ కొనసాగించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు పరిధిలో గతంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను యథావిధిగా కొనసాగించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో ఏర్పాటు చేసిన మార్కెట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. మున్సిపల్ గ్రీన్‌ల్యాండ్ స్థలంలో గుమ్టీలు వేసుకోగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామని చెప్పగా స్వచ్ఛందంగా గుమ్టీలను తొలగించామన్నారు. కూరగాయల మార్కెట్ లేదా షెడ్‌లను ఏర్పాటు చేయాలే తప్పా ఇతర అవసరాలను వినియోగించవద్దన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొల్లగోపు కిషోర్, జంగిలి అనిల్, వెంకటలక్ష్మి, పద్మ, పుష్పలత, బీమ్, హర్షవర్ధన్, రాజు, సాయి, ఉపేందర్ పాల్గొన్నారు.

దర్గా నిర్మాణానికి విరాళం అందజేత

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో గల హజ్రత్ జాన్‌పాక్ అమీరొద్దీన్ బాబా దర్గా నిర్మాణానికిగాను, మంగళవారం ఓం శ్రీ సాయి ఇండస్ట్రీస్ ప్రొప్రైటర్స్ మేకల సురేష్, నారాబోయిన రమేష్ కలిసి రూ.20,016ల విరాళాన్ని దర్గా కమిటీ అందించారు. అదే విధంగా కేసముద్రంవిలేజ్‌కి చెందిన కనుకుల రాంబాబు రూ.5,116ల విరాళాన్ని అందించారు.

వానరాల బెడదను అరికట్టేందుకు కృషి



మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పందుల, కోతుల సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పందుల, శునకాల, కోతుల సమస్య వాటి పరిష్కార విషయాలపై చర్చించారు. చైర్మన్ మాట్లాడుతూ.. పందులను వేరే ప్రాంతానికి తరలించామని తెలిపారు. పందుల పెంపకందారులు అడ్డుపడుతున్నారని ఆ విషయంలో అందరి సహకారం అవసరమన్నారు. శునకాల బెడదను అరికట్టేందుకు ఏబీసీ సెంటర్ ద్వారా 3452 శునకాలకు ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ సీహెచ్ ఉపేందర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.